# ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



రాజకీయపార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్

- కలెక్టర్ బోర్కడే హేమంత్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ఆసిఫాబాద్, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ కోరారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఎస్పీ సురేశ్ కుమార్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ నుంచి నవంబర్ 30 వ తేదీ పోలింగ్ జరిగే వరకు రాజకీయ పార్టీలు ఖర్చుల వివరాలను రిజిష్టర్‌తో పాటు అభ్యర్థుల ఏజెంట్లు కూడా తప్పకుండా నమోదు చేయాలన్నారు. వ్యయ పరిశీలకుల కమిటీ వద్ద ఉన్న ఖర్చుల వివరాలు, అభ్యర్థుల వద్ద ఉన్న ఖర్చు వివరాల్లో తేడాలు ఉండవద్దని, ఎన్నికల పరిశీలకులు రిజిష్టర్లను మూడుసార్లు తనిఖీ చేయాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాల కోసం తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. అభ్యర్థులు బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవీలు చూపించాల్సి ఉంటుందన్నారు. హెలీ ప్యాడ్ కోసం ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు, ఎన్నికల సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ డుబ్బుల నానయ్య

# బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

చింతలమానేపల్లి, అక్టోబర్ 30 : మండలకేంద్రంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను భారీ మెజార్టీతో గెలుపొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భీంకరి నారాయణ, సురేశ్, మహేశ్, ఆకాశ్, చౌదరి ప్రవీణ్, రామయ్య, సందీప్, పోశన్న, ప్రసాద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసులు, కేంద్ర బలగాల కవాతు



డబ్బా గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్, కేంద్ర బలగాలు



ఆడెపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్

చింతలమానేపల్లి, అక్టోబర్ 30 : మండలంలోని డబ్బా, ఆడెపల్లి, బాబాసాగర్, కర్జవెల్లి గ్రామాల్లో ఎస్ఐ వెంకటేశ్ కేంద్ర బలగాలతో కలిసి ప్రధాన రహదారులతో పాటు వీధుల గుండా సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ సూచించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



గోలేటి ఎక్స్‌రోడ్ లో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

# ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

రెబ్బెన, అక్టోబర్ 30: మండలంలోని గోలేటి ఎక్స్ రోడ్ వద్ద సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరికిల్ల స్వామి, గౌస్, తిరుపతి, లచ్చన్న, రవిప్రసాద్ గౌడ్, కృష్ణ, సతీశ్, బుచ్చన్న ఉన్నారు.

# నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



గోలేటి సీహెచ్‌పీ వద్ద కారును తనిఖీచేస్తున్న ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ

రెబ్బెన, అక్టోబర్ 30 : ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ సిబ్బందికి సూచించారు. మండలంలోని గోలేటి సీహెచ్‌పీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఎన్నికల నియయావళిని ప్రతిఒక్కరూ పాటించాలని, రూ. 50వేల కంటే ఎక్కువ మొత్తం నగదు తీసుకెళ్తే ఆధారాలు ఉండాలని లేకుంటే సీజ్ చేస్తామని అన్నారు.

## లక్ష్య అభ్యాస దీపికల పంపిణీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 30: జిల్లా కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన లక్ష్య అభ్యాస దీపికలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయులకు సోమవారం పంపిణీ చేసినట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు డిసెంబర్ 31వ తేదీ లోపు సిలబస్ పూర్తి చేయాలని,ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో రూపొందించినటువంటి ఈ లక్ష్య అభ్యాస దీపికల ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. బుక్ డిపో మేనేజర్ సత్యనారాయణ , స్పెషల్ ఆఫీసర్ ధర్మయ్య పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉప్పులేటి శ్రీనివాస్

# కాలుష్యాన్ని అరికట్టాలి

రెబ్బెన, అక్టోబర్ 30: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ దగ్గర ఉన్న డంప్ యార్డు నుంచి వస్తున్న పొగను నివారించాలని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు కోరారు. ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో సోమవారం సాయంత్రం జీఎం రవిప్రసాద్ ను కలిసి పలు సమస్యలను వివరించిన అనంతరం మాట్లాడారు. గోలేటిటౌన్‌షిప్ లో ఉన్న శ్రీ భీమన్న క్రీడామైదానం పక్కనున్న డంప్ యార్డు నుంచి వస్తున్న పొగ కారణంగా కార్మికకాలనీలల్లోని ప్రజలు వాకింగ్ చేసే వారు క్రీడాకారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంప్ యార్డును ఇక్కడి నుండి తరలించాలని జీఎంను కోరినట్లు తెలిపారు.



జీఎం రవిప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

## గుర్తు తెలియని మృతదేహం

సిర్పూర్(టీ), అక్టోబర్ 30 :పెద్దబండ గ్రామ సమీపంలోని చిన్న నీటి కుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రమేశ్ సోమవారం తెలిపారు. పెద్దబండ – ఆరెగూడ గ్రామ సమీపంలోని ఓ నీటి కుంటలో మృతదేహం ఉందని గ్రామస్తులు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన యువకుడి వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.